# చీకటిలో చిరుదివ్వె

అహిపతి ఇటీవలనే ప్రభుత్వోద్యోగిగా పదిహేనేళ్ల సర్వీసు పూర్తి చేసి ఆఫీసులోనే మినీ ఉత్సవం జరుపుకున్నాడు. సహోద్యోగులకి మేరీ బిస్కెట్లు, టీ ఇచ్చాడు. కొందరు 'పార్టీ' అన్నారు గాని, అహిపతి అంగీకరించలేదు. టీ పార్టీయే ఇస్తానని రిపార్టీ ఇచ్చాడు.

మరికొద్ది నెలల్లోనే వాగ్దేవి తనకు అర్ధాంగి అయిపదిహేనేళ్లు అయిన సందర్భంగా ఉన్న ఇద్దరు పిల్లలతోనూ, వివాహోత్సవం ఇంట్లోనే సూక్ష్మంగా జరుపుకున్నాడు. పులిహోర, బొబ్బట్లు చేసింది వాగ్దేవి. సరదాగా పిల్లలతో మయూరి థియేటర్లో 'నాట్య సుధా మయూరి'ని చూశాడు.

రాత్రి పది గంటలకి శయన మందిరంలో వింతైన కోరిక కోరేడు వాగ్దేవిని.

"వాగ్దేవీ! ఇవాళ నా కోరిక తీర్చాలి నువ్వు" అన్నాడు.

"పదిహేనేళ్ల నించీ ఉన్నదేగా? కొత్తేముంది?" అంది వాగ్దేవి చిరునవ్వులు చిందిస్తూ.

"కాదు. నువ్వు పొరబడ్డావు. తరచుగా నువ్వు తీర్చే కోరిక కాదిది."

– నువ్వు విద్యావతివి కావాలనే కోరిక ఇది. మన విశ్వ విద్యాలయం వారు కరస్పాండెన్సు కోర్సుద్వారా ఉద్యోగస్తులకీ, గృహిణులకీ ప్రత్యేకంగా డిగ్రీపూర్తి చేసే అవకాశం కల్పించారు. గతంలో ఏ చదువూ లేకపోయినా ఇరవయ్యొక్క సంవత్సరాలు నిండిన వాళ్లందరూ బి.ఏ., ప్రవేశ పరీక్షకు కూర్చోవచ్చు. నువ్వు తప్పకుండా ప్రవేశ పరీక్షకి కట్టాలి" ప్రోత్సహించేడు

అహిపతి.

అహిపతి కోరిన విడ్డూరమైన కోర్కెకి చోద్యపడింది వాగ్దేవి.

"ఆడపిల్లకి చదువెందుకే వెర్రి మొహమా! ఉద్యోగాలు చేయాలా? ఊళ్ళేలాలా? వండి పరుండడమే!" అని తల్లి చెప్పిన డైలాగుల టేపు వినిపించింది వాగ్దేవి.

వివాహాత్పూర్వము ఎనిమిదో క్లాసు వరకూ చదివింది వాగ్దేవి. వాస్తవానికి ఆనాడు ఇంకా చదువు కొనసాగిద్దామని ఆకాంక్ష వెలిబుచ్చింది కాని, వాళ్ళ నాన్న బ్రేక్ ఇన్‌స్పెక్టరై కూచున్నాడు. "మంచి సంబంధమే తల్లీ! నువ్వు చదువు పూర్తయ్యేక చేసుకుంటానంటే అప్పుడెలాంటి సంబంధం వస్తుందో?" అని నచ్చజెప్పాడు.

"అలాక్కాదు. ఉద్యోగాలు చేసి ఊళ్లేక్కర్లేదు. ఆ వయసు దాటిపోయింది కూడాను. డిగ్రీకాని చేతిలో ఉంటే భవిష్యత్తులో ఎలా ఎప్పుడు ఉపయోగపడుతుందో చెప్పలేం. పది మంది పిల్లలకి ప్రైవేటు చెప్పి విద్యాదానం చెయ్యొచ్చు" అన్నాడు అహిపతి.

"అలా అయితే ఫారం తెప్పించండి. నింపేస్తాను. మరి నోట్సు? గైడ్సు?"

"నోట్సు గయోపాఖ్యానం గైడ్సు పుస్తకాల షాపుల్లో కొనుక్కోడమే!"

దంపతులిద్దరూ నవ్వుకున్నారు.

"పిల్లల చదువు లొకటున్నాయ్. వాళ్ల సంరక్షణ చూసుకుంటూ, గృహ కృత్యాలు చేసుకుంటూ చదూకోవడం కష్టమేమో?" అనుమానించింది వాగ్దేవి.

"పిల్లలకి నువ్వేమిటి చెయ్యాలి చెప్పు! ముడ్డి కడగాలా? మూతి కడగాలా? వాళ్లెలాగూ పెద్దవాళ్లయారు. వాళ్లు పనులు వాళ్లు చేసుకుంటున్నారు. వాళ్లు స్కూళ్లకీ, నేను ఆఫీసుకీ వెళ్లేక నువ్వు ఏం చేయ్యాలి గనుక? మళ్లీ సాయంత్రం వరకూ ఖాళీయే కదా? ఈ మధ్యలో గైడ్సు తిరగేస్తూండు."

"ఒకే" అంది వాగ్దేవి.

మర్నాడు అహిపతి ఎంట్రెన్స్ గైడ్సు కొన్నాడు. వాగ్దేవిని ఎలాగైనా చదువు విషయంలో ఒప్పించగలననే ధీమాతో, ఆమెకు తెలియకుండా అంతకు ముందే తెప్పించిన అప్లికేషన్ ఫార్మ్, ప్రాస్పెక్టస్ బ్రీఫ్‌కేస్ లోంచి బయటికి తీశాడు. ఆమె చేత నింపించాడు. ఫోటో అతికించాడు. పోస్టు చేశాడు.

వాగ్దేవి ఎంట్రెన్స్ పరీక్ష పాసవడంతోపాటు మూడేళ్ల డిగ్రీకోర్సుని పడుతూ, లేస్తూ ఉన్న సముద్రపు కెరటాల్లా ఒక్కొక్క పార్టూ పోతూ, పాసవుతూ మొత్తం మీద ఏడేళ్లకి పూర్తి చేసింది. వాగ్దేవి ఇప్పుడు నలభయ్యేళ్ల ప్రౌఢ!

భర్త ప్రోత్సాహానికి పరమానంద భరితురాలైంది. డిగ్రీ చేతికి రాగానే ఏదో చెప్పనలవి కాని ఆత్మస్థైర్యం, నిబ్బరం వచ్చాయి. 'గృహిణి'గా తను వంటింటికే పరిమితమైనా, వంటింట్లో తాను వేసే పోపు ఘాటుకి వాటికన్‌లో పోపు తుమ్మినా ఆమెకిప్పుడు అలా అనిపించడం లేదు. 'నేనిప్పుడు విద్యావతియైన వంట పుట్టిని' అని ధైర్యంగా అనుకుంటూంది.

❁ ❁ ❁

ఒకనాటి ఉదయం పోలీసులు ఒక జీపులో అహిపతి ఇంటికి వచ్చారు.

"అహిపతి మిస్సెస్ ఎవరండీ?" అని ఇన్‌స్పెక్టరుగారు సన్నని చిన్న గొంతుకతో అడిగారు.

వాగ్దేవి నిప్పుష్టురాలైంది.

భర్త ఆఫీసుపని మీద విశాఖపట్నం వెళతానన్నారు. అదీ ఆఫీసుకేష్‌తో! కొంపతీసి దొంగలేం దోచీలేదు కదా?

"నేను!" అని తీగలు తెగిన వీణియలా మూగవోయిన స్వరంతో అంది.

"సారీ మేడమ్! మీ భర్తగారైన అహిపతిగార్కి చిన్న ఏక్సిడెంటయింది. కేజీహెచ్‌లో ఎడ్మిట్ చేశాం. మిమ్మల్నీ పిల్లల్నీ తీసుకెళ్లడానికి వచ్చాం. మరేం ఫరవాలేదు. బట్టలు సర్దుకుని బయల్దేరండి." అన్నాడు ఇన్‌స్పెక్టరు.

వాగ్దేవి ఆందోళన చెందుతూ షాక్ తినేసినట్లయింది. పిల్లలిద్దరూ బేజారెక్కిపోకుండా దుఃఖాన్ని ఆపుకుంది.

జీపు పరుగెడుతూంటే పరిపరి విధాల తన మనస్సూ పరుగెడుతూంది. తన బొట్టు చెరిగిపోయే రోజు, గాజులు పగిలిపోయే రోజు వచ్చినట్లు ఊహించుకుంది.

కేజీహెచ్ ఆవరణలో జీపు ఆగింది. ఆమెనూ పిల్లలనూ మార్చురీవైపు తీసుకెళ్లారు పోలీసులు.

వాగ్దేవి ఊహించింది నిజమైంది. భర్త శవం మీద వాలి భోరున ఏడ్చింది. "నాన్నారూ!" అని పిల్లలు బావురుమన్నారు.

కాలం గడుస్తున్న కొద్దీ విషయం పాతబడుతూంది. వాగ్దేవి గతాన్ని విస్మరించి భవిష్యత్తు మీదికి దృష్టి సారించింది. గత జలసేతుబంధనం వల్ల ప్రయోజనం ఏమిటి?

చనిపోయిన ఉద్యోగులపై ఆధారపడ్డవారిలో వారి వారి అర్హతల్ని బట్టి ఉద్యోగం యివ్వాలనే జీవో ప్రకారం, వాగ్దేవికి డిగ్రీ కలిగి వున్నందుకు వయః పరిమితితో నిమిత్తం లేకుండా, జూనియర్ అసిస్టెంటు ఉద్యోగం లభించింది. ఇదికాక భర్త చేసిన ఇరవై రెండేళ్ల సర్వీసుకి రావలసిన పెన్షన్, గ్రాట్యుయిటీ, ఇన్స్యూరెన్స్ వంటి ఇతరమైన బకాయిలు, ఏక్సిడెంటులో పోయినందుకు భర్తకు రావలసిన నష్టపరిహారం కూడా అందుకుంది వాగ్దేవి. పిల్లలిద్దరి పేర చెరి సగం బ్యాంకులో వేసింది. వాళ్లిద్దరూ జీవితంలో స్థిరపడే వున్నారు.

వర్షాల్లేక భూములు బీటలు వారినప్పుడు మేఘాలు వర్షించి, అన్నదాతకు, భోక్తలమైన మనకు బొజ్జనిండినట్టుగా-

సముద్ర స్నానానికి వెళ్లినవాడు ప్రమాదవశాత్తూ మునిగిపోయినప్పుడు జాలర్లు రక్షించినట్లుగా-

కీకారణ్యంలో ఒంటరిగా ప్రయాణిస్తున్న పాంథునికి వర్షం కురియకుండా ఉరుములు మెరుపులతో కూడిన కాంతులే తోవ చూపించినట్లుగా-

అంధకార బంధురమైన జీవితాల్లో ఏదో ఒక చిరుదివ్వె వెలగక మానదు.

డిగ్రీ చేతిలో వుండడంవల్ల ప్రయోజనం ఏమిటో ఇప్పుడు తెలిసింది వాగ్దేవికి. గౌరవప్రదమైన హోదాలో హుందాగా వుంటూ, సభ్యసమాజంలో తలెత్తుకుని తిరిగే అవకాశం వచ్చింది.

తాను అకాలమృతికి గురి అవుతానని అహిపతికి తెలియకపోయినా, తాను వైధవ్యం అనుభవించవలసి వస్తుందని వాగ్దేవీ ఊహించకపోయినా, భర్త తననెందుకు డిగ్రీ చదవమని ఆనాడు ప్రోత్సహించాడో- ఇప్పుడర్థమైంది వాగ్దేవికి.

"నీకుతెలీదు, డిగ్రీ అన్నది చేతిలోవుంటే ఎప్పుడు, ఎలాగ ఉపయోగ పడుతుందో చెప్పలేం. విద్య నిగూఢగుప్తమగు విత్తము" అనే భర్తగారి, భర్తృహరిగారి సూక్తి ముక్తావళిని నిత్యం మననం చేసుకుంటూనే వుంటుంది వాగ్దేవి.

• ఆంధ్రప్రభ డెయిలీ

*21-7-1990*